# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## 16న రాష్ట్ర కేబినెట్ సమావేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి ఈనెల 16వ తేదీన సమావేశం కానుంది. ఈ భేటీలో ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, బిసి రిజర్వేషన్‌లతో పాటు పలు అంశాలపై చర్చించే అవకాశం -ఉన్నట్టుగా తెలిసింది. ప్రతి 15 రోజులకు కేబినెట్ సమావేశం ఒకసారి నిర్వహించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వరదలు, బిసి రిజర్వేషన్ల హడావిడి తదితర కారణాలతో కొంతకాలంగా కేబినెట్ సమావేశం జరగలేదు. అందులో భాగంగా ఈనెల 16వ తేదీన కేబినెట్ సమావేశం జరపాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా తెలిసింది. అందులో ప్రధానంగా ఎస్ఎల్‌బిసీ సొరంగం పనులు ప్రారంభించే అవకాశం, దీంతో పాటు వివిధ ప్రాజెక్టుల అంచనాలు పెంచడం, మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు, తమ్మిడిహట్టి వద్ద నిర్మాణం, సమ్మక్క-సారక్క ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీ-ఫైబర్ విస్తరణ, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అంశాలు మంత్రివర్గ భేటీలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది.



## రాయదుర్గంలో టీ-స్క్వేర్ ప్రాజెక్ట్

- ఏఐ హబ్ కార్పస్ ఫండ్ కోసం బోర్డు ఏర్పాటు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలకు కేంద్రమైన రాయదుర్గం ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయంగా టీ-స్క్వేర్ నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా ఉండాలని, నవంబర్ నెలాఖరు నాటికి ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని చెప్పారు. ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఏఐ హబ్, టీ-స్క్వేర్ తదితర అంశాలపై సమీక్షించారు. హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన టీ-స్క్వేర్ ప్రాజెక్టుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు.

టీ-స్క్వేర్ నగరంలోనే ఒక ఐకానిక్ భవనంలా ఉండాలని, అందుకు అనుగుణంగా డిజైన్, నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. టీ-స్క్వేర్ డిజైన్ పర్యాటకులను ఆకర్షించడం, రెస్టారెంట్లు, వ్యాపారం వంటి అంశాలు పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఆ ప్రాంతం 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదేశాన్ని తీర్చిదిద్దాలి. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, రంగురంగుల డిజిటల్ ప్రకటనల ద్వారా ప్రపంచ స్థాయి డిజిటల్ డిస్‌ప్లే తో రూపొందించాలి. యాపిల్ లాంటి ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు అక్కడ వ్యాపారం నిర్వహించేలా ఉండాలి. పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాహనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు ఉండాలి. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, వాణిజ్య కార్యకలాపాలతో పాటు కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా టీ-స్క్వేర్ రూపుదిద్దుకోవాలి.. అని చెప్పారు. హైదరాబాద్ లో ఒక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏఐ ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, సెంటర్లను ఒకే చోట కలిపి, ప్రపంచ ఏఐ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ హబ్‌లతో భాగస్వామ్యం చేసేందుకు ఈ హబ్ ఉపయోగపడాలని స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు...

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్ ఫైళ్లపైనా వివరణ కోరనున్న ప్రభుత్వం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల జీవో నెంబర్ 9, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి, హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని సుప్రీంను కోరనున్నారు. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున దీనిలో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించనుంది. అదే సమయంలో జీవో 9 అమలు చేసేందుకు అనుమతించాలని కోరనుంది. అలాగే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతే అసెంబ్లీ చేసిన తీర్మానం, గవర్నర్‌కు రెండుసార్లు పంపిన బిల్లులు, అవి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా పార్టీగా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. బిల్లుల్ని గవర్నర్, రాష్ట్రపతి పెండింగ్ పెట్టడం అంశంపై సుప్రీంకోర్టు ద్వారానే వివరణ తీసుకోవాలని భావిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా సుప్రీంకు వెళ్లేందుకు ఉన్న అన్ని దారుల్ని వెతకాలనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూనే, స్థానిక ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారు. జీవో నెంబర్ 9ని సవాలు చేస్తూ గతంలో కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం, హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున అక్కడే వాదనలు వినిపించుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆ కేసును కొట్టివేసిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు ఈ కేసులో ప్రభుత్వ నిర్ణయాలపై స్టే విధించిన నేపథ్యంలో దాన్ని సవాలు చేస్తూ మళ్లీ సుప్రీంలో వాదనలు వినిపించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఇదే కేసులోని ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే సుప్రీంలో కేవియెట్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కూడా ఇంప్లీడ్ అయిన కక్షిదారుల వాదనలు విన్న తర్వాతే, ప్రభుత్వ వాదనను వినాల్సి ఉంటుందని న్యాయనిపుణులు చెప్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులు ప్రతి శుక్రవారం అర్ధరాత్రి రాష్ట్ర ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి అందాయి. దీనిపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి న్యాయనిపుణులు, అందుబాటులో ఉన్న మంత్రులో మాట్లాడారు. మరోవైపు బీసీ సంఘాలు కూడా సుప్రీంకు వెళ్లాలని నిర్ణయించాయి.

స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టుకు వెళ్లడం వల్ల ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టొచ్చని రేవంత్ సర్కార్ రాజకీయంగా వ్యూహ రచన చేస్తోంది. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వల్లే హైకోర్టులో తీర్పు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వచ్చిందంటూ ప్రచారాన్ని మొదలు పెట్టాయి. ఈ కేసులో ఆ రెండు పార్టీలు కూడా ఇంప్లీడ్ అయ్యేలా ఒత్తిడి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డికి కొందరు మంత్రులు సూచించినట్టు తెలిసింది. ఇప్పటి వరకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీ రిజర్వేషన్లను రాజకీయాల లబ్ది కోసమే వాడుకుంటున్నాయి తప్ప, చిత్తశుద్ధితో వ్యవహరించట్లేదు. సుప్రీంకు వెళ్లడం వల్ల ఇదే విషయాన్ని ప్రజల్లోకి కూడా తీసుకెళ్లాలని కాంగ్రెస్‌పార్టీ భావిస్తోంది.

## చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు పనులను పునరుద్ధరిస్తాం



- తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సర్కారు సిద్ధం
- త్వరితగతిన డీపీఆర్‌లు సిద్ధం చేయాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు పనులను పునరుద్ధరిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నా మని ఆయన చెప్పారు. ఇకపై నీటిపారుదల శాఖ అద్వర్యంలోని ప్రాజెక్టలకు సోలార్ విద్యుత్‌ను అందిస్తామని చెప్పారు. అందుకు అనుగు ణంగా ఇరిగేషన్ భూముల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికా రులకు ఆయన సూచించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివా లయంలో నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వ హించారు. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్య దర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ప్రభుత్వ సలహాదారుడు ఆదిత్య నాథ్ దాస్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాత ప్రతిపాదన ప్రకారం తుమ్మిడిహట్టి నుంచి ఎల్లం పల్లి ద్వారా చేవెళ్లకు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. తుమ్మిడిహట్టి నుంచి 71 కిలోమీటర్ల మేర దూరం ఉన్న కాల్వపనులలో ఇప్పటికే 45 కిలోమీటర్ల దూరం పూర్తి అయ్యాయని చెప్పారు. 71 కిలోమీటర్ల పాయింట్ నుంచి అంటే మంచిర్యాల జిల్లా మైలారం గ్రామ సమీపం నుంచి నీటిని తరలించడానికి రెండు మార్గాలను పరిశీలిస్తున్నామన్నారు. అందులో మొదటిది పాత ప్రణాళిక ప్రకారం మైలారం నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో

మిగితా 2వ పేజీలో

## బీసీ రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు కీలక స్పష్టత..

### 50% పరిమితి దాటకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుకోవచ్చు




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు హైకోర్టు సమగ్ర తీర్పు కాపీతో కొంతవరకు తెరపడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై స్టే విధించిన హైకోర్టు, ఈ విషయంపై శుక్రవారం అర్ధరాత్రి సమగ్ర తీర్పు కాపీని విడుదల చేసింది.

**హైకోర్టు కీలక సూచనలు:**

50% పరిమితి: సుప్రీంకోర్టు విధించిన నిబంధనల ప్రకారం, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించుకోవచ్చునని హైకోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది.

పెంచిన రిజర్వేషన్ల మార్పు: జీవో 9 ద్వారా పెంచిన 17 శాతం రిజర్వేషన్లను (25% నుండి 42% వరకు పెంచారు) ఓపెన్ కేటగిరీగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం రీ-నోటిఫై (పునఃప్రకటన) చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని న్యాయస్థానం పేర్కొంది.

ఎన్నికల ప్రక్రియలో జోక్యం లేదు: ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవాలని లేదా ఎన్నికలను నిలిపివేయాలని తమ ఉద్దేశం కాదని, కేవలం ప్రభుత్వ జీవోలో మార్పును మాత్రమే ప్రతిపాదిస్తున్నామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించినప్పటికీ, 50% పరిమితికి లోబడి ఎన్నికలు నిర్వహించుకునేందుకు మార్గం సుగమం చేసింది. హైకోర్టు తాజా సూచనల మేరకు ఎన్నికల సంఘం పెంచిన రిజర్వేషన్లను ఓపెన్ కేటగిరీగా మార్చి తిరిగి నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. ఈ నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందనేది వేచి చూడాలి.

## వైద్య విద్యార్థినిపై సామూహిక లైంగికదాడి

బలగం టీవి, కోల్‌కతా

ఒడిశా రాష్ట్రంలోని జలేశ్వర్ కు చెందిన ఒక ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థిని పై పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో సామూహిక లైంగికదాడి జరిగిన ఘటనా వార్త ప్రజలను షాక్‌కు గురిచేసింది. ఈ దురాగతం దుర్గాపూర్‌లోని శోభాపూర్ సమీపంలో ఉన్న ప్రైవేట్ మెడికల్ కాలేజీలో చోటుచేసుకుంది. బాధితురాలు శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో డిన్నర్‌కు క్యాంపస్ నుంచి బయటకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో, ఆమె స్నేహితుడు ఒంటరిగా క్యాంపస్ గేటు వద్ద ఆమెను విడిచిపెట్టిన తర్వాత, గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి మొబైల్ ఫోన్‌ను కాజేసి, బలవంతంగా క్యాంపస్ బయట ఉన్న అటవీ ప్రాంతానికి లాక్కుని వెళ్లారు. అక్కడే ఆమెపై సామూహిక లైంగికదాడి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

పోలీసు అధికారుల ప్రకారం, నిందితులు బాధితురాలిని ఏదైనా ఈ సంఘటన గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని, అలాగే మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేశారు. పోలీసులు సిసిటివీ ఫుటేజీ సేకరణ, సాక్ష్యాధారాల సేకరణ కోసం ఫోరెన్సిక్ బృందాన్ని ఆ ప్రాంతానికి పంపించారని తెలిపారు. బాధితురాలిని మరియు ఆమె తల్లిదండ్రులను కలుసుకోవడానికి నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ బృందం దుర్గాపూర్ బయల్దేరింది.



## కాంగ్రెస్ పార్టీలో మరో ఇద్దరు మంత్రుల మధ్య వివాదం..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరో ఇద్దరు మంత్రుల మధ్య వివాదం తెరపైకి వచ్చింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య విభేదాలు తలెత్తాయని సమాచారం. తన దేవాదాయ శాఖ వ్యవహారాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకుని, పెత్తనం చెలాయించడం పట్ల మంత్రి కొండా సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ముఖ్యంగా, మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల నవనిర్మాణం కోసం చేపట్టిన టెండర్ల విషయంలో పొంగులేటి జోక్యంపై కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మేడారం అభివృద్ధి పనుల్లో భాగంగా దాదాపు రూ.71 కోట్ల విలువైన టెండర్‌ను మంత్రి పొంగులేటి తన మనుషులకు ఇప్పిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన శాఖకు సంబంధించిన కీలకమైన టెండర్ల ప్రక్రియలో మరో మంత్రి జోక్యం చేసుకోవడం, తన ప్రమేయం లేకుండానే నిర్ణయాలు జరుగుతుండటంపై కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో మరోసారి అంతర్గత విభేదాలకు తావిచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం

- నలుగురు మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గన్ కల్చర్ అమెరికాను వణికిస్తున్నది. అక్కడ మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. మిసిసిప్పీ రాష్ట్రంలోని ఓ పాఠశాల సమీపంలో ఓ దుండగుడు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 12మందికిపైగా గాయపడ్డారు. పోలీసుల వెల్లడించిన సమాచారం ప్రకారం.. శుక్రవారం రాత్రి మిస్సిస్సిప్పి రాష్ట్రం లేలాండ్ నగరంలో అర్ధరాత్రి ఫుట్‌బాల్ ఆట ముగిసిన తర్వాత ఓ వ్యక్తి విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో నలుగురు మరణించారు. మరో 12 మంది గాయపడ్డారని ప్రముఖ వార్త సంస్థ బీబీసీ నివేదించింది. శుక్రవారం రాత్రి రద్దీగా ఉండే సమయంలో లేలాండ్ ప్రధాన వీధిలో కాల్పులు జరిగాయని నగర మేయర్ మేయర్ జాన్ లీ తెలిపారు. ఈ కాల్పుల ఘటనకు ముందు ఓ స్కూల్ సమీపంలో పాఠశాలల పూర్వ విద్యార్థులను స్వాగతించే వార్షిక అమెరికన్ సంప్రదాయ ఫుట్‌బాల్, ఇతర కమ్యూనిటీ ఈవెంట్‌లు జరిగాయి. ఈ ఈవెంట్‌లో నిందితుడు కాల్పులకు తెగబడినట్టు సమాచారం. కాల్పులతో వేడుక విషాదంగా ముగిసింది. అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారనీ, నిందితుల్ని గుర్తించేందు ప్రత్యక్షసాక్షులు ముందుకు రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా కాల్పులు జరిపింది 18 ఏండ్ల యువకుడిగా పోలీసులు అనుమా నిస్తున్నారు. అనుమానితుడి కోసం పోలీసులు గాలింపు చర్యల్ని ముమ్మరం చేశారు. అమెరికాలో ఉన్న గన్‌కల్చర్.. అక్కడ ఇలాంటి కాల్పులకు కారణమవుతున్నది. గత కొన్నేండ్లుగా ఇలాంటి కాల్పుల ఘటనలతో పదుల సంఖ్యలో అమా యకపు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అయి నప్పటికీ అక్కడి యంత్రాంగాలు ఈ విషయంలో ఎలాంటి శ్రద్ధా చూపకపోవటం గమనార్హం.

## వరంగల్, నల్లగొండలో ఇంక్యూబేషన్ కేంద్రాలు

- 'టీ-హబ్' తరహాలో ఏర్పాటు
- మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటి రెడ్డి వెంకటరెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వరంగల్, నల్లగొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్టు వివరించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని' గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగాగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్ గా మాత్రమే కాకుండా 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్‌ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివ ద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.డాక్టర్ల కంటే వేగంగా రోగాలను నిర్ధారించినా, అనుభూతి చెందే మనసును మాత్రం ఏ యంత్రం భర్తీ చేయలేదన్నారు. దేశంలో తమ అనుభవాన్ని 'నాలెడ్జ్ ఇన్వెస్ట్ మెంట్'గా పెట్టేందుకు ముందుకు రావాలని ప్రవాసీ భారతీయ నిపుణులకు విజ్ఞప్తి చేశారు. పేటెంట్లను కాకుండా మీ ఆవిష్కరణ వల్ల ఎంత మందికి మేలు జరిగిందన్నదే చరిత్ర గుర్తుంచుకుంటుందని యువ ఇన్నోవేటర్స్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, డా.బి.ప్రభా శంకర్, రాంప్రసాద్ రెడ్డి, ప్రద్యుమ్న, డా.తామర విజయ్ కుమార్, ప్రొఫెసర్ భాస్కర్ ఆర్.జాస్తి, రాజేశ్వర్ తోట, ప్రొఫెసర్ జె. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## జనకచర్ల ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకించట్లేదు

- మహారాష్ట్ర, కర్నాటక తీరుతో రాష్ట్రానికి నష్టం
- మాజీ మంత్రి హరీశ్ రావు




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి హరీశ్‌రావు బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడంలేదు అని ప్రశ్నించారు. డీపీఆర్ అప్రైజల్ పై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడంలేదో ఆయన నిలదీసి పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ టెక్నో ఎకనమిక్ అప్రైజల్ ప్రాసెస్ కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికు లేఖ రాశారని హరీశ్‌రావు తెలిపారు. ఆ లేఖ 20 రోజుల క్రితం రాసినా, రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించలేదు.

"మన దేశంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నిబంధనలు, రాజ్యాంగం ప్రకారం వరద జలాలపై డీపీఆర్ అప్రైజల్ జరగదు. అయినప్పటికీ, ఏపీ ప్రభుత్వం ఈ వరద జలాలపై బనకచర్ల డీపీఆర్ అప్రైజల్ సబ్మిట్ చేసింది. కేంద్ర ప్రభుత్వం దీనిని పరిశీలిస్తుందని లేఖలో పేర్కొన్నారు. అయితే రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదని స్పష్టం చేయాలి."

463 టీఎంసీలు నీటిని గోదావరి నుంచి కృష్ణా నదికి ఏపీ మళ్లిస్తుంది. "మేము ఆల్మట్టిలో 112 టీఎంసీలు ఆపుతామని కర్ణాటక ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. దీని వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుంది," అని హరీశ్‌రావు తెలిపారు. అంతేకాక, కర్ణాటక 112 టీఎంసీలు, మహారాష్ట్ర 74 టీఎంసీలు ఆపితే తెలంగాణ పరిస్థితి ఎలా ఉంటుందో కూడా హరీశ్‌రావు ప్రశ్నించారు. "నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు?" అని ఘాటుగా విమర్శించారు.

"కేంద్ర ప్రభుత్వం పోలవరంని జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించినప్పుడు కుడి కాలువ కెపాసిటీ 11,500 క్యూసెక్కులు మాత్రమే. ఇప్పుడు అదే 23,000 క్యూసెక్కులుకు పెంచారు. గతంలో 18,000కు పెంచినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకుంది, కానీ ఇప్పుడు 23,000కు పెరిగినా ఎవరు అడ్డుకోలేదు, బిల్లులు రిలీజ్ అయ్యాయి. ఇది బీజేపీ పార్టీ ఎలా అనుమతించింది?" అన్నారు.

### ఫార్ములా-ఈ రేస్‌తో

## గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్

- త్వరలో భారతదేశ 'మొబిలిటీ వ్యాలీ'గా హైదరాబాద్ ఆవిర్భావం
- టీ-హబ్, టీ-వర్క్స్' తెలంగాణ ఆవిష్కరణలకు జంట స్తంభాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎం ఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు 2025కి హాజరైన కేటీఆర్

వివరాలు 2వ పేజీలో



## చైనా దిగుమతులపై అమెరికా సుంకాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే చైనాపై 30 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాణిజ్యంపై చైనా అసాధారణంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా , చైనా ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా, వాటికి సుంకాలు వర్తిస్తాయి " అని అమెరికా అధ్యక్షుడు తన పోస్టులో వెల్లడించారు. ఇది అన్ని దేశాలను ప్రభావితం చేస్తుందని , ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపారు. నవంబరు 1 నుంచి లేదా ముందుగానే ఈ టారిఫ్‌లు అమల్లోకి రావచ్చన్నారు. చైనా తీసుకునే తదుపరి చర్యలను బట్టి దీనిపై యూఎస్ నిర్ణయం ఉంటుందన్నారు. అలాగే క్రిటికల్ సాఫ్ట్‌వేర్‌ను ఇతర దేశాలతో పంచుకోవడంపై నియంత్రణ విధిస్తున్నట్టు వివరించారు. అమెరికా తయారు చేసే దాదాపు ప్రతి ఉత్పత్తి పైనా భారీగా ఎగుమతి ఆంక్షలు విధించాలని చైనా యోచిస్తోందనే నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్ ... భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు.

# యూరియా రాయితీ ధరకే కేంద్రం భరిస్తోంది

- **కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



**బలగం టీవీ, కరీంనగర్**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా ధరలు ఆకాశాన్ని అంటుతున్నా.. ధరలు పెంచకుండా ఆ మొత్తాన్ని కేంద్రమే భరిస్తూ రాయితీ ధరకే యూరియాను అందిస్తున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దేశంలోని రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏటా రూ.24 వేల కోట్ల నిధులతో ధన్ ధాన్య క్రుషి యోజన పథకాన్ని నేటి నుంచి అమలు చేస్తున్నామని వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని కరీంనగర్ మిల్క్ డెయిరీ ప్లాంట్ వద్ద ధన్ ధాన్య క్రుషి యోజనను ప్రారంభించారు. అనంతరం రూ.90.70 కోట్లతో నిర్మించిన ఆటోమెటిక్ కర్డ్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. ధన్ ధాన్య క్రుషి యోజన పథకం 100 జిల్లాలను ఎంపిక చేసి 1 కోటి 70 లక్షల మంది రైతులను అన్ని విధాలా ఆదుకుని లాభాలు కలిగించేందుకే తీసుకువచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణలోని 4 జిల్లాలు గద్వాల్, నారాయణపేట, నాగర్ కర్నూల్, జనగామలో ఈ పథకం నేటి నుంచి అమలువుతుందని తెలిపారు. ఏటా 24 వేల కోట్ల చొప్పున ఆరేళ్లపాటు నిధుల కేటాయిస్తామని చెప్పారు.

'కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (కరీంనగర్ డెయిరీ) 27 ఏళ్ల చరిత్ర ఉంది. 2021లోనే 3 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సాయం అందించింది. కరీంనగర్ డెయిరీ ఆస్తులను గతంలో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే నేను కార్పొరేటర్‌గా ఉంటూ డెయిరీ పక్షాన అనేక ఉద్యమాలు చేశా' అని బండి సంజయ్ గుర్తుచేసుకున్నారు. అప్పుడు ఎన్నో కేసులు నమోదైనా లెక్క చేయలేదని.. ఉద్యమాలు చేసి కరీంనగర్ డెయిరీకి అండగా నిలిచారని చెప్పారు. ఎంపీగా మీకు సేవ చేయడమే లక్ష్యమని.. తనకు అహంకారం, గర్వం రాదని చెప్పుకొచ్చారు. తాను ఏ స్థాయికి వెళ్లినా అణిగిమణిగి ఉంటానని.. అందరికీ అందుబాటులో ఉంటానని బండి సంజయ్ తెలిపారు.

రైతును రారాజును చేయాలన్నది తమ ప్రభుత్వ సంకల్పం అని.. యూరియా ధరలు విపరీతంగా పెరిగినా ఆ ఖర్చును భరించి అతి తక్కువ ధరకే సరఫరా చేస్తున్నట్లు బండి సంజయ్ వివరించారు. ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మాట ఇచ్చి అమలు చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి సాధ్యమని భావిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యమనే విషయాన్ని ఎవరూ మరువొద్దని సూచించారు.

# చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు పనులను పునరుద్ధరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఒక లిఫ్ట్ అవసరం ఉంటుం దని గుర్తించామన్నారు. రెండోది అదే పాయింట్ నుంచి సుందిళ్ల బ్యారేజ్ వరకు సుమారు 55 కిలోమీటర్ల దూరం వరద కాలువ ద్వారా నీటిని తరలించే అవకాశం ఉందన్నారు. రెండు మార్గాలు కూడా ఆర్థికంగా భారం కాకుండా తక్కువ ఖర్చుతో అయ్యేలా అధికారులు ప్రతిపాదించారన్నారు. అధికారుల ప్రతిపాదనలకు మంత్రి స్పందిస్తూ రెండు మార్గాలకు సంబంధించిన డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇదే విషయపై వారం రోజుల్లో ప్రత్యేక సమీక్ష నిర్వహిం చాలని ఆయన అధికారులకు సూచించారు. సవ రించిన డీపీఆర్ అక్టోబర్ నాటికి సిద్ధం చేయాల న్నారు. అలాగే నీటి పారుదల శాఖకు చెందిన భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఇకపై విద్యుత్‌తో నడిచే నీటిపారుదల శాఖ ప్రాజెక్టులకు సోలార్ విద్యుత్ ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎత్తిపోతల పథకాలకు సోలార్ విద్యుత్‌ను విని యోగించడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవ చ్చని చెప్పారు. అందుకు నీటిపారుదల శాఖ భూముల్లో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించుకో వచ్చని చెప్పారు. అదే విదంగా దేవాదుల ప్యాకేజ్ 3, కల్వకుర్తి ప్యాకేజీ 29, పాలమూరు-రంగారెడ్డి ప్యాకేజ్ 7, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తదితర ప్రాజెక్టు పనులపై ఆయన సమీక్షించారు. ఈ పనుల పునరుద్ధరణకు గాను ఏరియల్ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచడం, బనకచర్ల ప్రాజెక్టు అంశాలపై కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

### ఫార్ములా-ఈ రేస్‌తో

# గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి. రామారావు (కేటీఆర్) మరోసారి తెలంగాణ ఆవిష్కరణల ప్రస్థానాన్ని జాతీయ వేదికపై చాటిచెప్పారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్ నిర్వహణ గురించి ప్రస్తావించారు. తాము నిర్వహించిన ఫార్ములా ఈ రేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై అడుగుపెట్టిందనడానికి ప్రతీక అని కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు 2025కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా, దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ వీధుల్లో పరుగెత్తినప్పుడు, భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందని రుజువైంది. ఈ రేసు దాదాపు రూ. 700 కోట్ల ఆర్థిక కార్యకలాపాన్ని సృష్టించి, అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఫార్ములా-ఈ ఈవెంట్ ఒక ఆరంభం మాత్రమేనని, తెలంగాణ స్థిరమైన, సాంకేతికత ఆధారిత పారిశ్రామిక వృద్ధి లక్ష్యాన్ని కలిగి ఉందని, త్వరలోనే హైదరాబాద్ భారతదేశ మొబిలిటీ వ్యాలీ'గా ఆవిర్భవించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మోటార్‌స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదుబీ అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడం, ఎంత దూరం వెళ్లగలమో తెలుసుకోవడం అని, జీవితంలో యువత కూడా రేసు కారు మాదిరి దూసుకుపోవాలని కేటీఆర్ అన్నారు.

ఐటీ మంత్రిగా తన హయాంలో, ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టీ-హబ్, భారతదేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రమైన టీ-వర్క్స్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఎలా నిర్మించిందో కేటీఆర్ వివరించారు. "ఒక ఆలోచన టీ-హబ్ నుండి టీ-వర్క్స్‌కు వెళ్లడానికి ఒక టీ తాగేంత సమయం మాత్రమే పడుతుంది" అంటూ ఆలోచన అమలు వేగాన్ని చమత్కరించారు.

**యువత ఉద్యోగాలు సృష్టించాలి: కేటీఆర్ పిలుపు**

వందలాది మంది యువ ఇంజనీర్లకు సందేశమిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా, వాటిని మీరే సృష్టించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "మీరు సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి?" అని ప్రశ్నించారు. "ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారండి. మీరు పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత, మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ఆయన ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, కానీ, "ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత, అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డాము. తెలంగాణ సాధించిన ప్రగతి విశ్వాసానికి పట్టుదలకు దర్శనీకత నిదర్శనం అన్నారు.

నేటి యువతరం, Gen Z కు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తూ, కేటీఆర్... ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆకలిని కలిగి ఉండాలని సూచించారు. మీరు ఇతరులు అనుకున్నదాని కంటే తెలివైనవారు, బాధ్యత కలిగినవారు. భారతదేశాన్ని ముందుకు నడిపించేది మీరే" అని విద్యార్థులకు తెలిపారు. మోటార్‌స్పోర్ట్స్ అయినా, పాలన అయినా, జీవితంలో అయినా విజయం కేవలం యాదృచ్ఛికంగా రాదని, "మనం మన అవకాశాలను రూపొందించుకోవాలి, ధైర్యంతో అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్తు నిర్మితమవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.




# క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో సైబర్ మోసాలు

- **అంతర్ రాష్ట్ర నిందితుడి అరెస్ట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో వాట్సాప్ ద్వారా ఏపీకే లింక్‌లు షేర్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర సైబర్ నిందితుడిని సిరిసిల్ల టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

చిన సిరిసిల్ల డీఎస్పీ కె. చంద్రశేఖర రెడ్డి వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఈ నిందితుడిపై మొత్తం 327 ఫిర్యాదులు నమోదయ్యాయని చెప్పారు. సైబర్ మోసాలకు పాల్పడుతూ బాధితుల బ్యాంక్ అకౌంట్ల నుంచి డబ్బులు దోచుకున్నట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు. సమాచారం అందుకున్న సిరిసిల్ల టౌన్ పోలీస్ బృందం చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. సాంకేతిక సాక్ష్యాలతో కలిసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. సైబర్ నేరస్తుడిని పట్టుకోవడంలో అత్యంత చురుకైన చర్యలు చేపట్టిన సిరిసిల్ల పట్టణ పోలీసులను డీఎస్పీ చంద్రశేఖర రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అపరిచిత లింకులు క్లిక్ చేయరాదని, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. సైబర్ మోసాల నుండి రక్షణ కోసం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లింకులు అందిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు.




# బీసీలకు 42% రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి.

**-బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర బీ ఆర్ ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం కోటా కేటాయిస్తూ విడుదల చేసిన జీ.ఓ 9ను రద్దు చేసే కుట్రలు జరుగుతున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.హైకోర్టు స్టే కారణంగా ప్రభుత్వం బాధ్యతను బిఆర్ఎస్‌పై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. బీసీల ఓటు బ్యాంకుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు బలహీన వర్గాల గొంతు కోస్తోందని మండిపడ్డారు.

జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు ఇద్దరూ బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు..బీసీల రిజర్వేషన్‌పై పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చిన పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధి చూపి 42 శాతం రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని, ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. "బీసీల నోటికాడి ముద్దను లాక్కున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని జాతీయ పార్టీలపై బీసీ బిడ్డలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, కోడం వెంకటేశం, శివ రాం, కాసర్ల శ్రీనివాస్, మొగిలి, పరుశరాములు, సంతోష్ కర్రే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీకి బిగ్ షాక్..

**బలగం టీవీ, హైదరాబాద్**




భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం మాజీ జాయింట్ కన్వీనర్ చెర్క మహేష్ బీజేపీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీబీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావుకు ఆయన తన రాజీనామా లేఖను పంపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు 'గుట్టుచప్పుడు కాకుండా' చేతులు కలిపి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని చెర్క మహేష్ తన లేఖలో సంచలన ఆరోపణలు చేశారు. ఈ రెండు పార్టీల లోపాయికారి ఒప్పందం వల్లే తాను పార్టీలో కొనసాగలేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా, రైతులు, యువత, మహిళలు, బీసీలు రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్నా, సమస్యలపై బీజేపీ మౌనంగా ఉండటం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రజలను మోసం చేశాయని ఆయన ఆరోపించారు. "బీసీ రిజర్వేషన్ల అంశంలో ఈ రెండు పార్టీలు ప్రజలను దారుణంగా మోసం చేశాయి. రైతులు, యువత, మహిళలు, బీసీలు తీవ్ర బాధలో ఉన్నా బీజేపీ నాయకత్వం మౌనంగా ఉంది. ఇలాంటి పార్టీలో నేను కొనసాగలేను" అని చెర్క మహేష్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ రాజీనామా తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా బీజేపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.



# తెలంగాణ ధూమ్ ధామ్ ఆట పాట

**బలగం టీవీ, వేములవాడ**

తెలంగాణ ప్రజా సమితి – కతర్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ నిర్వహించని విధంగా ఐడియల్ ఇండియన్ స్కూల్ ఓపెన్ గ్రౌండ్ లో నిర్వహించిన తెలంగాణ ధూమ్ ధామ్ ఆట పాట చాలా ఆటహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఇండియన్ ఎంబసీ కౌన్సిలర్ హెడ్ శ్రీ వైభవ్ గారు కుటుంబ సమేతంగా హాజరు అయ్యారు. ఇట్టి కార్యక్రమం కి యాంకర్ రాములమ్మ మరియు సింగర్ వరం తన ఫోక్ సాంగ్స్ తో అలరించారు. అలాగే ఈ కార్యక్రమం లో చిన్న పిల్లల మరియు ఆడ పడుచుల నృత్య ప్రదర్శన అహుతులని అలరించాయి. కార్యక్రమం చివరలో మన తెలంగాణ సాంప్రదాయ వంటకాలతో భోజనం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమం కి సుమారుగా 3000 మందికి పైగా హాజరు అయ్యారు. తెలంగాణ ప్రజా సమితి – కతర్ ప్రెసిడెంట్ శ్రీ గద్దె శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఈ వేడుకలని చాలా ఘనంగా నిర్వహించారు. అలాగే ఈ వేడుకలో వైస్ ప్రెసిడెంట్ శ్రీ అశోక్ మండల గారు, కార్య నిర్వహణ కమిటీ సభ్యులు హారిక గడ్డం, సతీష్ ఉప్పుల, వేణుప్రసాద్ వెల్దండి, రాధిక ఏముల, గౌరి సతీష్ ఉప్పుల, మనోజ్ కుమార్ డికొండ, ఉపేందర్ రాడం, శృతి ఉపేందర్ రాడం, లక్ష్మన్ మంద మరియు కతర్ లో ఉన్న మన తెలుగు వారందరు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమం విజయవంతం గా జరగడానికి సహకరించిన స్పాన్సర్స్, వాలంటీర్స్ మరియు యూట్యూబర్లు అందరికి తెలంగాణ ప్రజా సమితి – కతర్ తరపున ధన్యవాదాలు తెలియజేసారు.



# రైతులు పండించిన వరి ధాన్యం మొత్తం కొంటాం..

- **నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

**బలగం టీవీ, నకిరేకల్**

నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం రైతులు పండించిన వరి ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. శనివారం నాడు కట్టంగూర్ మండల కేంద్రంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.గత సంవత్సరాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొను గోలు చేశామని, ఈ సంవత్సరం కూడా ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులు అందరూ తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. రైతులు ఎవరూ కూడా దళారుల బారిన పడి నష్టపోకూడదని హితవు పలికారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎంట్రీ రిజిస్టర్ ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల–మాధవ్ రెడ్డి, అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వ కేంద్రాలకే తీసుకురావాలని ఎమ్మెల్యే వేముల వీరేశం విజ్ఞప్తి చేశారు.

# పెద్దపల్లి ప్రజలకు శుభవార్త

- **రామగుండం ఎయిర్‌పోర్టు కల నిజం దిశగా ముందడుగు**

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి ప్రజల ఎన్నో దశాబ్దాల కల అయిన రామగుండం ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు నిజం దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఎయిర్‌పోర్టు కోసం రూ.40.53 లక్షలు మంజూరు చేయడంతో పాటు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ప్రీ ఫీజిబిలిటీ స్టడీ ఫీజు చెల్లించినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఇది రామగుండం ఎయిర్‌పోర్టు స్థాపన దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగు అని ఎంపీ పేర్కొన్నారు.

ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా అనంతరం మండలంలోని 591 ఎకరాల భూమిపై గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనపై ఈ స్టడీ జరగనుందని తెలిపారు. రామగుండం ఎయిర్‌పోర్టు ద్వారా పెద్దపల్లి ప్రజలతో పాటు సింగరేణి సిబ్బంది, విద్యార్థులు, వ్యాపార వర్గాలకు భారీగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. "హైదరాబాద్‌కు గంటల కొద్దీ ప్రయాణం చేసే అవసరం లేకుండా ప్రత్యక్ష వైమానిక కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీనివల్ల నూతన ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలు పుట్టుకొస్తాయి," అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రీ ఫీజిబిలిటీ స్టడీ పూర్తయ్యాక సెంటర్ ఫిజిబిలిటీ స్టడీ నిర్వహించనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, పెద్దపల్లి జిల్లా అభివృద్ధికి ఒక మలుపు తిప్పే ఘట్టం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఆర్జిత సేవలు కల్పిస్తున్నాం

- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి ఆర్జిత సేవలు ప్రారంభం**
- **ఉత్సవ మూర్తులను పల్లకీలో రాజన్న ఆలయం నుంచి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగింపు**



**బలగం టీవీ, వేములవాడ**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి మరియు విస్తరణ పనుల నేపథ్యంలో రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు భీమేశ్వర స్వామి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు, దర్శనాలు కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా, ఆలయ అధికారులు, అర్చకులు ఉత్సవ మూర్తులను పల్లకీ సేవలో రాజన్న ఆలయం నుండి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

శనివారం నుండి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో లాంఛనంగా స్వామివారి ఆర్జిత సేవలు ప్రారంభమయ్యాయి. నిత్యాన్న దాన సత్రం పై అంతస్తులో నిత్య కళ్యాణం సేవలు కూడా మొదలయ్యాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కోడెమొక్కును ప్రారంభించి, అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల కోసం గత ఏడాది నవంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ. 42 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు, రూ. 76 కోట్లతో ఆలయ విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి పనుల కోసం శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి శృంగేరి పీఠాధిపతి వారి అనుమతి, సలహాలు, సూచనలు తీసుకున్నామని, వారి సూచనల మేరకు ఆలయాన్ని అభివృద్ధి పరుస్తామని అన్నారు. రానున్న మరో వంద సంవత్సరాల వరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఇబ్బందులు తలెత్తకుండా రాజన్న ఆలయాన్ని అత్యంత శ్రేష్ఠంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

రాజన్న ఆలయంలో పనులు జరుగుతున్నందున, స్వామివారికి ఏకాంత సేవలు యథావిధిగా జరుగుతాయని, ఉత్సవ మూర్తులను (పార్వతీ పరమేశ్వర, క్షేత్రపాలకుడు అనంత పద్మనాభ స్వామి) నేడు భక్తుల మధ్య ఊరేగింపుగా భీమేశ్వర ఆలయానికి తీసుకువచ్చామని తెలిపారు. టెంపుల్ సిటీ అభివృద్ధి: వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ నెల 19న శృంగేరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విధిశేఖర భారతి శర్మ వేములవాడకు రానున్నారని, స్వామివారిని దర్శించుకుని అభివృద్ధి పనులపై పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ బీడీ కార్మికులకు. పీఎఫ్ పెన్షన్ అందించాలి




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీడీ కార్మికురాలు రిటైర్మెంట్ అయిన తర్వాత ఇవ్వాల్సిన పిఎఫ్ కేంద్ర బిజెపి ప్రభుత్వం అతి తక్కువగా 500, 600, 800, 1000 లు గా రూపాయలుగా ఇవ్వడం జరుగుతోందని, ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సి ఐ టీ యు బీడీ వర్కర్స్ సిగార్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర శ్రీరాముల అన్నారు.శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర శ్రీరాముల మాట్లాడుతూ ప్రతి బీడీ కార్మికులు రెక్కలే ఆస్తులుగా చేసుకొని శ్రమిస్తూ వారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని అన్నారు. అనారోగ్యాలు బారిన పడుతూ ఒత్తిడిలకు గురవుతున్న కుటుంబాన్ని పోషించుకోవడానికి బీడీ కార్మికురాలుగా శ్రమిస్తూ జీవితం కొనసాగిస్తూ ఉన్నారని అన్నారు. బీడీ కార్మికులకి రిటైర్మెంట్ అయిన తర్వాత పిఎఫ్ పెన్షన్ ద్వారానే వాళ్ళ జీవితాన్ని గడుపుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎవరైతే అర్హులైన రిటైర్మెంట్ అయిన బీడీ కార్మికులకి నెలకు.7500 రూపాయలు పి ఎఫ్ పెన్షన్ గా బీజేపీ ప్రభుత్వా%శీ% తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యత ఉంటుంది అని అన్నారు.

కార్మికుల యొక్క పిఎఫ్ డబ్బులు కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారు మరియు కార్మికులకు ఆరోగ్యానికి సంబంధించిన ఈ ఎస్ ఐ హాస్పిటల్ కూడా పక్కన పెట్టేశారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బీడీ కార్మికుల గురించి ఈఎస్ఐ హాస్పిటల్ గురించి ఎక్కడ కూడా మాట్లాడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికుల పరిస్థితులు అత్యంత దీన పరిస్థితిలో ఉన్నప్పటికీ,వాళ్ల కష్టాన్ని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. పెన్షన్ అందించని పక్షాన కార్మికులందరినీ పూర్తిస్థాయిలో పోరాటానికి సన్నద్ధం చేసి,హక్కును సాధించేవరకు ఉద్యమం చేస్తామని అన్నారు.

# రామగిరి దారుణ హత్య కేసులో 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్

- **ఏసీపీ రమేష్**

**బలగం టీవీ, రామగిరి**

రామగిరి మండల సమాఖ్య కార్యాలయం సమీపంలోని సెంటినరీ కాలనీ డీఆర్డీఏ, టీజీఎస్ఇఆర్ఎఫ్ కార్యాలయం వద్ద శుక్రవారం చోటుచేసుకున్న దారుణ హత్య కేసులో పోలీసులు వేగంగా స్పందించారు. 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు.

ఏసీపీ కథనం ప్రకారం కోట చిరంజీవి, న్యూ మారేడుపాక గ్రామానికి చెందిన వ్యక్తి. పోతన కాలనీలో 'మీ సేవా' సెంటర్ నడుపుతూ జీవనం సాగించేవాడు. హత్యకు సంబంధించి పెంచికల్‌పేట గ్రామానికి చెందిన సంధ్యారాణి, అనవేనా మల్లయ్య, అనవేనా నరేష్, పొలవెన కుమార్, పిడుగు చందులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మూడు మోటార్‌సైకిళ్లు, హత్యకు ఉపయోగించిన ఇనుపరాడు, చాకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ హత్య ఘటనపై అక్టోబర్ 10న మృతుడు చిరంజీవి తమ్ముడు కోట రామ్‌చరణ్ ఫిర్యాదు మేరకు రామగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పెద్దపల్లి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ కరుణాకర్ ఆదేశాల మేరకు ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో మంథని సీఐ రాజు, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్‌రావు, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, దివ్య, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్, ముత్తారం ఎస్ఐ రవికుమార్ తదితరులు దర్యాప్తు చేపట్టారు.

శనివారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు పెంచికల్‌పేట ఎక్స్‌రోడ్డు వద్ద ఐఓసీ పెట్రోల్‌బంక్ సమీపంలో నిందితులు బైక్‌పై వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

2019లో భార్య మరణించిన తర్వాత చిరంజీవి ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో నిందితురాలు సంధ్యారాణి ఒకరోజు తన పనిమీద 'మీ సేవా' సెంటర్‌కి వెళ్ళి చిరంజీవిని కలిసింది. ఆ పరిచయం తర్వాత చిరంజీవి తరచూ ఆమెకు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు పంపడం ప్రారంభించాడు. సంధ్యారాణి మాట్లాడకపోతే చంపేస్తానని బెదిరించడంతో భయపడి ఆమె అతనితో మాట్లాడేది. అయితే కాలక్రమేణా వేధింపులు పెరగడంతో సంధ్యారాణి భర్తకు విషయం తెలిపింది. రెండు నెలల క్రితం పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగినా, చిరంజీవి ప్రవర్తనలో మార్పు రాలేదు.

అక్టోబర్ 10న సెంటినరీ కాలనీ సమైక్య కార్యాలయం వద్ద సంధ్యారాణి పనిచేస్తుండగా చిరంజీవి అక్కడికి చేరుకుని గొడవపడ్డాడు. ఈ విషయం తెలిసిన సంధ్యారాణి భర్త, అన్న, తండ్రి, బావమరిది అక్కడికి చేరుకుని చిరంజీవిపై దాడి చేశారు. తండ్రి ఇనుపరాడుతో, చాకుతో దాడి చేయగా ఇతరులు పట్టుకున్నారు. తలపై తీవ్ర గాయాలతో చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. గోదావరిఖని ఏసీపీ రమేష్ మాట్లాడుతూ, "మృతుడిపై వ్యక్తిగత ద్వేషం, వేధింపుల కారణంగా ఈ హత్య జరిగినట్లు దర్యాప్తులో బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించాము," అని తెలిపారు.



# టీ20లో నమీబియా సంచలనం

**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20 క్రికెట్‌లో చిన్న జట్లు పెద్ద జట్లను షాకిస్తున్న దృశ్యం మళ్లీ ఆవిష్కృతమైంది. తాజాగా నమీబియా జట్టు సఫారీలను చిత్తు చేస్తూ ప్రపంచ క్రికెట్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇరుజట్ల మధ్య జరిగిన ఏకైక టీ20లో నమీబియా 4 వికెట్ల తేడాతో సెన్సేషనల్ విజయాన్ని నమోదు చేసింది. నమీబియా స్టార్ బౌలర్ రూబెన్ ట్రంపెల్‌మన్ అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. మొదట బౌలింగ్‌లో 3 వికెట్లు పడగొట్టి సఫారీల బ్యాటింగ్ లైన్‌ను కట్టడి చేయగా, అనంతరం బ్యాటింగ్‌లో 11 నాటౌట్ పరుగులు సాధించి జట్టుకు విజయాన్ని అందించాడు.

మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నమీబియా బౌలర్లకు బలైపోయింది. ఓపెనర్ ప్రిటోరియస్ (22), స్మిత్ (31) కాసేపు ప్రతిఘటించినా పెద్ద స్కోర్ సాధించలేకపోయారు. మిగతా బ్యాటర్లు విఫలమవడంతో నిర్ణీత ఓవర్లలో సఫారీ జట్టు 134 పరుగులకే పరిమితమైంది. లక్ష్య ఛేదనలో నమీబియా బ్యాటర్లు ధైర్యంగా ఆడారు. కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (21) సాయంతో జట్టు పునాది వేయగా, వికెట్ కీపర్ జేన్ గ్రీన్ (30 నాటౌట్) చివరి దశల్లో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. చివరి ఓవర్లో గ్రీన్ బాదిన సిక్స్, ఫోర్‌తో నమీబియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించి సఫారీలకు షాకిచ్చింది. ఇటీవలి కాలంలో నేపాల్ వెస్టిండీస్‌పై సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించగా, ఇప్పుడు నమీబియా కూడా ఆ జాబితాలో చేరింది. వరుసగా చిన్న జట్ల విజయాలు ప్రపంచ క్రికెట్‌ను కదిలిస్తున్నాయి. "టీ20ల్లో ఏ జట్టూ చిన్నది కాదు" అని మరోసారి రుజువైంది.



# "కె ర్యాంప్" ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మరోసారి తన ప్రత్యేక కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యాడు. తాజాగా విడుదలైన "కె ర్యాంప్" ట్రైలర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ట్రైలర్ విడుదలైన గంటల్లోనే యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. కిరణ్ అబ్బవరం నటన, హాస్య పంచులు, రొమాంటిక్ ట్రాక్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. "అలా కాళ్లూపకూడదేమో బాబూ" అని బామ్మ చెప్పగా, "నేను ఊపడం లేదు బామ్మా.. నా గర్ల్‌ఫ్రెండ్ ని తలుచుకుంటే వాటంతట అవే ఊగుతున్నాయి" అన్న డైలాగ్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

"కనీసం ఈరోజైనా డబ్బున్నోడిలా బిహేవ్ చేయ్ రా", "వరమిస్తానంటూ నా వెంటపడుతున్నాడు సార్", "లవ్ చేస్తే లైఫ్ ఇస్తానని వరమిచ్చాను సార్", "పెద్దయ్యాక నా జీవితం ఇలా ఉంటుందని తెలిస్తే చిన్నప్పుడే కుత్తిక పిసుక్కొని చచ్చిపోయేవాడిని" వంటి పంచ్‌లతో ట్రైలర్ మొత్తం ప్రేక్షకులను నవ్వుల ముంపులో ముంచేసింది. హాస్యం, రొమాన్స్ మేళవించిన మాస్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతుందనే సంకేతాలు ట్రైలర్‌లో కనిపిస్తున్నాయి.

ట్రైలర్ మొత్తం చూస్తే దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ శైలిని గుర్తు చేస్తోంది. ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు సిట్యుయేషనల్ హాస్యాన్ని మిళితం చేసినట్లుగా అనిపిస్తోంది. కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజ హీరోయిన్‌గా నటిస్తుండగా, వీకే నరేష్, వెన్నెల కిషోర్, సాయి కుమార్, మురళీధర్ గౌడ్ తదితరులు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ పతాకంపై నిర్మాణం కొనసాగుతోంది. మొదట టీజర్ విడుదలైనప్పుడు కొంతమంది ఈ సినిమాను అడల్ట్ ఎంటర్‌టైనర్‌గా భావించినా, ట్రైలర్‌తో ఆ అనుమానాలకు ముగింపు లభించింది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తున్న ఈ చిత్రం కిరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో నెలకొంది. దీపావళి కానుకగా ఈ నెల 18న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. సినీ సర్కిల్స్ టాక్ ప్రకారం, ఈ చిత్రం ఇండియా వైడ్‌గా దాదాపు రూ.8 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో బరిలోకి దిగుతుందని తెలుస్తోంది. అంటే వసూలు చేయాల్సిన మొత్తం గ్రాస్ రూ.16 కోట్లు. దీపావళి బరిలో మూడు తెలుగు, మూడు డబ్బింగ్ సినిమాలు రిలీజ్ అవుతుండటంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

## గాంధీజీపై అనుచిత వ్యాఖ్యలు.. శ్రీకాంత్ భరత్‌పై ఎమ్మెల్సీ ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్**

జాతిపిత మహాత్మా గాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ భరత్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర వివాదాన్ని సృష్టించాయి. ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్ బల్మూరి, నటుడిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం వెంకట్ బల్మూరి హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ను ఆశ్రయించి, శ్రీకాంత్ భరత్‌పై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంలో ఆయన మీడియాకు మాట్లాడుతూ, వాక్ స్వాతంత్ర్యం పేరుతో కొందరు హద్దులు మించిపోతున్నారని, గాంధీజీ వారసులైనవారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు అని మండిపడ్డారు.

# ఢిల్లీ టెస్టులో టీమిండియా ఆధిపత్యం

- గిల్ శతకం, జడేజా మ్యాజిక్
- 518 పరుగులకు భారత్ తొలి ఇన్నింగ్స్ డిక్లేర్
- సెంచరీలతో కదం తొక్కిన యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్
- రెండో రోజు చివరకు 140/4తో కష్టాల్లో వెస్టిండీస్
- మూడు వికెట్లతో విండీస్‌ను దెబ్బతీసిన రవీంద్ర జడేజా




**బలగం టీవీ, హైదరాబాద్**

ఢిల్లీ టెస్టులోనూ భారత జట్టు ఆధిపత్యం కొనసాగుతోంది. టాపార్డర్ బ్యాటర్ల మెరుపులతో భారీ స్కోర్ సాధించిన టీమిండియా బౌలర్ల బెల్లం బాణాలతో వెస్టిండీస్‌ను దెబ్బతీసింది. తొలి ఇన్నింగ్స్‌ను 518/5 వద్ద డిక్లేర్ చేసిన శుభ్‌మన్ గిల్ సేన తర్వాత బౌలర్ల ధాటికి పర్యాటక జట్టు భరతం పడుతోంది.

**జడేజా మ్యాజిక్‌తో విండీస్ తడబాటు**

భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన వెంటనే బుమ్రా, సిరాజ్ బౌలింగ్ దాడి మొదలైంది. ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ (10) కొంతసేపు తట్టుకున్నా, రవీంద్ర జడేజా ఓవర్లో స్వీప్ షాట్ ప్రయత్నంలో వికెట్ పారేసుకున్నాడు. సుదర్శన్ చక్కగా అందుకోవడంతో విండీస్ తొలి వికెట్ కోల్పోయింది. తదుపరి తగ్‌నరైన్ చందర్‌పాల్ (34), అలిక్ అథనజే (41)లు రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం చేశారు. కానీ జడేజా తన స్పిన్ మ్యాజిక్ చూపించి చందర్ పాల్‌ను స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కించాడు. వెంటనే కుల్దీప్ యాదవ్ అథనజేను ఔట్ చేయగా, రోస్టన్ ఛేజ్ (0)ను రిటర్న్ క్యాచ్‌గా జడేజా పెవిలియన్ చేర్చాడు. 107 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన విండీస్ మరోసారి ఆలౌట్ ప్రమాదంలో పడింది.

రూషాయ్ హోప్ (31 నాటౌట్), టెవిన్ ఇమ్లేచ్ (14 నాటౌట్) క్రీజులో నిలబడి రెండో రోజు ఆట ముగిసే సరికి జట్టు స్కోర్‌ను 140/4కి చేర్చారు. మూడో రోజు ఉదయం ఈ జోడీ త్వరగా ఔట్ అయితే విండీస్ తొలి సెషన్‌లోనే కుప్పకూలే అవకాశం ఉంది.

**గిల్ ధాటికి విండీస్ బౌలర్ల బెంబేలెత్తు**


మొదటి రోజు భారత ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (175), కేఎల్ రాహుల్ (38) బలమైన పునాది వేశారు. యశస్వీ శతకంతో చెలరేగగా, సాయి సుదర్శన్ (87) అర్ధశతకంతో అదరగొట్టాడు. రెండో రోజు ప్రారంభంలో యశస్వీ రనౌట్ అయినా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. నితీశ్ కుమార్ రెడ్డి (43), ధ్రువ్ జురెల్ (44)లు విలువైన ఇన్నింగ్స్‌లు ఆడడంతో టీమిండియా స్కోరు వేగంగా పెరిగింది. గిల్ ఆఖర్లో సిక్స్‌లు, ఫోర్లతో విండీస్ బౌలర్లను వణికించాడు. రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో జురెల్ ఔట్ కావడంతో 518/5 వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

**స్పిన్ ద్వయం ధాటికి విండీస్ ఇబ్బందుల్లో**

భారత్ స్పిన్ జంట జడేజా, కుల్దీప్ యాదవ్‌లు విండీస్ బ్యాటర్లకు కంటకమయ్యారు. జడేజా ఇప్పటివరకు 3 వికెట్లు తీసి సత్తా చాటగా, కుల్దీప్ ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. భారత బౌలర్లు అదే ధాటిని మూడో రోజు కొనసాగిస్తే విండీస్‌పై భారీ ఆధిక్యం సాధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## 'వసుదేవసుతం' టీజర్ లాంచ్

**బలగం టీవీ, హైదరాబాద్**




'దేవి' సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకున్న మాస్టర్ మహేంద్రన్ ఇప్పుడు హీరోగా రాణించడానికి సిద్ధమయ్యాడు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'వసుదేవసుతం', దీనిని వైకుంఠ్ బోను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను టాలీవుడ్ హీరో సత్యదేవ్ విడుదల చేశారు. "ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా... లక్షల బంధుగణమైనా... ఎదురు కోట్ల సాయుధులే ఉన్నా... ధర్మ హింస తథైవచ" ం అంటూ వినిపించే డైలాగ్స్ సినిమాపై భారీ క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ డైలాగ్స్ ద్వారా ప్రధాన పాత్ర ధర్మపరుడైన యువకుడిగా కనిపించబోతున్నట్లు స్పష్టమవుతోంది. గుడి, గుప్తనిధి, రహస్య శక్తుల చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా ముందుకు సాగే సూచనలు టీజర్‌లో కనిపించాయి. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్ గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రం, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత్ బజాజ్, అంబికావాణి వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుందని టీజర్ స్పష్టంగా తెలియజేస్తోంది. రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్ర రిలీజ్ డేట్‌పై మేకర్స్ త్వరలోనే అధికారిక ప్రకటన ఇవ్వనున్నారు.

# శ్రీలంకపై ఇంగ్లండ్ ఘన విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**




మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచ్‌లలో భారీ తేడాతో గెలిచిన ఇంగ్లండ్, మూడో పోరులో కూడా అదే రీతిలో విజయం సాధించింది. ఆతిథ్య శ్రీలంకను చిత్తు చేస్తూ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది.

కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (117) ఆభరణంగా ఆడుతూ తన శతకంతో ఇంగ్లండ్‌కు బలమైన స్థాయి ఇచ్చింది. మరోవైపు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ (4/17) అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాటింగ్ లైన్‌ను చీల్చి వేసింది. దీంతో ఆతిథ్య జట్టు పరాజయాన్ని తప్పించుకోలేకపోయింది.

**భారీ స్కోర్‌తో ఇంగ్లండ్ ఆధిపత్యం**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ టాపార్డర్ తడబడినా, కెప్టెన్ సీవర్ బ్రంట్ మిడిలార్డర్ సహకారంతో జట్టును నిలదీశారు. టమ్మీ బ్యూమాంట్ (32), హీథర్ నైట్ (29)లు కీలక ఇన్నింగ్స్ ఆడడంతో నిర్ణీత ఓవర్లలో 253 పరుగులు చేసింది ఇంగ్లండ్. శ్రీలంక బౌలర్లకు చుక్కలు చూపించిన సీవర్ బ్రంట్ తన ఇన్నింగ్స్‌లో ఎడాపెడా బౌండరీలు బాదుతూ ఐదో సెంచరీ సాధించింది.

**లంక బ్యాటర్లు వైఫల్యం**

విపరీత లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక బ్యాటర్లు ప్రారంభం నుంచే తడబడ్డారు. విష్మి గుణరత్నే (15), హాసిని పెరీరా (35), హర్షిత సమరవిక్రమ (33)లు తప్ప మరెవరూ పెద్దగా ప్రతిఘటించలేకపోయారు. ఎకిల్‌స్టోన్ చతురతతో బౌలింగ్ చేస్తూ వరుసగా వికెట్లు తీసింది. కవిష దిల్హారి (4), ఆటపట్టు (15)లను ఔట్ చేస్తూ లంక ఇన్నింగ్స్‌ను కూల్చింది.

**164కే లంక ఆలౌట్**

నాట్ సీవర్ బ్రంట్ కూడా బౌలింగ్‌లో రెండు వికెట్లు తీయగా, స్మిత్ వేసిన 46వ ఓవర్లో ప్రబోధిని ఔట్ చేయడంతో లంక 164 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో ఇంగ్లండ్ 89 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

**పాయింట్ల పట్టికలో అగ్రస్థానం**

వరుసగా మూడు విజయాలతో ఆరు పాయింట్లు సాధించిన ఇంగ్లండ్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఫార్మ్‌లో ఉన్న సీవర్ బ్రంట్ మరియు ఎకిల్‌స్టోన్ ప్రదర్శనలు ఇంగ్లండ్‌కు వరల్డ్ కప్ గెలుపు ఆశలను మరింత బలపరిచాయి.